


ఎస్.కాశీ విశ్వనాథం

సూరమ్మ అందంగా ఉండదు.

ఆమెకు ఓ కన్ను, ఓ కాలు ఉండవు.

ఆమె వారాని కొకసారయినా స్నానం చెయ్యదు.

ఆమెను గురించి ఓ పది పదిహేను మందికి తప్పితే ఎక్కువ మందికి తెలియదు. ఎందుకంటే ఆమె ఎమ్. ఎల్. ఎ. గాని, ఎమ్.పి. గాని కాదు, అందరికీ తెలియడానికి. కనీసం ఆవిడ మునిసిపల్ కౌన్సిలరయినా అయి ఉంటే ఆ వార్డులో వారికయినా తెలిసి ఉండేది.

ఆవిడో ముష్టిది!

శనివారంపూట వెంకటేశ్వరుడి కోవెల ముందు కూర్చుని గొంతెత్తి ఏడుకొండల వాడిని గురించి వచ్చిన తెలుగు సినిమా పాటలు పాడుతూ ముష్టెత్తుకుంటుంది. మంగళవారంనాడు ప్రభాత్ సినిమా దగ్గరున్న ఆంజనేయస్వామి కోవెల ముందు కూర్చుని శ్రీరాముడిని గురించిన పాటలు పాడుతూ అడుక్కుంటుంది. ఆ రెండు రోజుల్లోను, ఎంత నీరసంగా చూసినా మూడు రూపాయలకు తక్కువగాకుండా సంపాదిస్తుంది. తతిమ్మా రోజుల్లో నయితే, అక్కడా ఇక్కడా అని లేదు, ఎక్కడైనా సరే జనసమ్మర్దం ఉన్న చోట్లలో కూర్చుని పాటలు పాడుతుంది. జనం పలచగానున్న చోటవయినా సరే, ఆవిడ గొంతెత్తి పాడితే అర్జెంటు పనుల మీద పోతున్నవాళ్ళ అలా విని, ఇలా కదిలి పోయినప్పటికీ, అంత అర్జెంటు పనులు లేనివాళ్ళ, అసలు పనుల్లేని వాళ్ళ, ముఖ్యంగా సామాన్యులు గంటల తరబడి నిలబడి ఆమె పాటలు వింటుంటారు. తమకు తోచిన ధర్మం చేస్తుంటారు. ఆవిణ్నెవరయినా కలుసుకోవా లనుకుంటే, మంగళవారమయితే ఆంజనేయస్వామిగుడి దగ్గర, శనివారమయితే వెంకటేశ్వరుడి గుడి దగ్గర దొరుకుతుంది. ప్రతి రోజూ రాత్రి ఏడు గంటలు దాటిన తరవాతగాని, తెల్లవారుఝాము అయిదు గంటలు దాటక ముందుగాని పీర్లకోనేరు పక్కనున్న ఫుట్‌పాత్‌మీద, రావిచెట్టు క్రింద తప్పకుండా దొరుకుతుంది. అక్కడ ముష్టివాళ్ల 'కాలనీ' అంటూ ఒకటి లేదుగాని, అక్కడ ప్రభుత్వంవారు పదిలంగా పరిచిన ఫుట్‌పాత్ కొంతమంది ముష్టివాళ్లకు, మరికొంతమంది పూసలు, సూదులు, కొమ్ముదువ్వెనలు అమ్ముకునే కొండజాతి వారికి అద్దెగాని, ఆసీలు గాని లేని ఉచితంగా ఉపయోగపడుతూంది. వారంతా చీకటి పడ్డంతోటే అక్కడికి చేరుకుంటారు. చీకటి విడీవిడక ముందే లేచి ఎవరి జోలి వారు పట్టుకుని, యాచనకు వెళ్లిపోతారు. వారందరిని అక్కడ చీకటే కలుపుతుంది. చీకట్లోనే వారు ఒకరికొకరు స్నేహితులయి పోయారు. బంధువులుకూడా అయి పోయారు. ఆ చీకటిలోనే శరీరాలు పెనవేసుకుని, సంతానాన్ని పెంచుకున్న వారుకూడా ఎంతో మంది ఉన్నారు.

మసగ్గా ఉన్న వెన్నెల ఆ ఫుట్‌పాత్ మీదనున్న రావిచెట్టు ఆకుల్లోంచి తప్పించుకుని, ఆ చెట్టు కింద పడుకున్న ముష్టివాళ్లమీద పడుతూంది. విరిసిన వెన్నెలతో కమ్మని భావాలు నింపుకోవ డానికి, ఆనందాన్ని పెంచుకోవడానికి, కవనాలు సాగించడానికి అక్కడున్నవారు కవులు కారు, రసికులు కారు, రస హృదయు లంతకన్నా కారు, వాళ్ళ కేవలం ముష్టివాళ్లే కాబట్టి గుర్రు పెట్టి నిద్రపోతున్నారు. పక్కనే ఉన్న రిజర్వ్‌బారక్స్‌లో ఠంగు ఠంగుమని పదకొండు గంటలు కొట్టారు. ఫుట్‌పాత్‌మీద పడుకున్న సూరమ్మ తన కున్న ఒంటికాలుని వయ్యారంగా ఊపుతూ, తనకు మిగిలిన ఒంటి కంటితో రావిచెట్టు ఆకులమధ్యలోనించి, ఎండలో పెట్టిన బంగారపు పళ్లెంలాగ మెరుస్తున్న చంద మామని చూస్తూ, ఆ మధ్య ప్రభాత్ సినిమాలో ఆడిన ఓ తెలుగు సినిమాలోని పాట నందుకొంది.

"మావా, సందమావా,

ఇనరావా, నా కద. . ." అంటూ పాడుతూంది.

ఇంతలో "ఇన్నానే, ఇన్నాను, కాని, ఇని ఏటి సెయ్యమంటావే" అన్నాడు పొడుగుకాలు పెంటయ్యగాడు, సూరమ్మ వైపు ఆశగా చూస్తూ. సూరమ్మకి ఉన్నది ఒక్క కన్నే అయినా, మిగిలింది ఒక్క కాలే అయినా, ఆ ఫుట్‌పాత్‌మీద పడుకున్న పాతిక ముప్పయి మందిలోనూ మగవాడిని రెచ్చగొట్టే అందం ఒక్క సూరమ్మకే ఉందని వాళ్లలో మొట్ట మొదటిసారిగా కనిపెట్టిన వాడు పొడుగు కాలు పెంటయ్యగాడే! పెంటయ్యగాడు సూరమ్మ పాడే పాటలకి పక్కవాద్యంగా కుండ వాయిస్తాడు. కుండ వాయించి, పాటలకి రక్తి కట్టిస్తాడు. కుండ వాయించడంలో వాడికి మంచి నేర్పుంది. తన కుండ వాద్యం వల్లనే సూరమ్మ పాటలు బాగా రక్తి కట్టి అంత డబ్బు సంపాదించగలుగుతూందని వాడి కో గొప్ప నమ్మకం!



"ఒరే, జెండాకొయ్య పెంటియ్యా, నువ్వు నోరు మూసుకుని ఒల్లక తొంగోరా!" అంది సూరమ్మ విరాగ్గా.

"తొంగుంటానే, తొంగుంటాను. కాని తోడెవరూ నేక నిద్దరట్టడం నేదే" అన్నాడు పెంటయ్య తన ముడుకులు మీద చేతులు వేసి రుద్దుకుంటూ.

"నిద్దరట్టకపోతే ఎల్లి ఓ గలాసు ఏసుకొని రానేకపోనావట్రా, ఇయ్యాల సినోరంకదా, నీ ఒంతు రూపాయిబేడ ఇందాకే ఇచ్చీనాను కదా!" అంది సూరమ్మ.

సూరమ్మ పాటకి కుండ వాయించి నందుకు ప్రతి రోజూ దొరికిన ముష్టిలో మూడు వంతులు తను ఉంచుకోగా, ఒక వంతు పెంటయ్య కిస్తుంది సూరమ్మ. అదీ వాళ్ళ ఒప్పందం.

"గవర్నమెంటోడి సారా వొచ్చిన కాణ్నించి, అప్పె, గలాసులికి గలాసులు నోట్లో ఏసుకోవడమేగాని, మునుపు ఒక్క గలాసు నాటుసారా పాటి సుకం రాడం నేదే! ఒక్క గలాసేటి, రెండు గలాసులు ఏసుకున్నాను. కానేటి నాభం? టాకూరు కొట్లో టీనీలు తాగినట్టుగాకూడా నేదు. అందుకే నిద్దరట్టటం నేదు. పోనీ, ఓ పని సెయ్యి. ఎమ్జీవోడి సొంత పిచ్చర్ లోని పాట పాడు, నేను కుండోయి స్తాను" అంటూ తన తల దగ్గరున్న కుండను తీయబోయాడు పెంటయ్య.

సూరమ్మ ఫక్కుమని నవ్వి, "ఒరే, పెంటిగా, ఇంత రేతిరిపూట నువ్వు కుండోయిస్తే, పోలీసోడొచ్చి నీ వీపు వాయిస్తాడు. రాతుళ్ళ పెద్ద పెద్ద కేక లెట్టొద్దని మొన్నే కదా పెద్ద జెవాను దెబ్బలాడాడు. మరిసిపోనావేటి?" అంది సూరమ్మ. వాళ్ల ఫుట్‌పాత్ పక్కనే రిజర్వు పోలీసుల బారక్సూ, దాని కెదురుగా పోలీస్ సూపరింటెండెంట్ వారి ఆఫీసూ ఉన్నాయి.

సూరమ్మ చెప్పిన మాటలు పెంటయ్యకి కొంచెం కోపం తెప్పించాయి.

"ఈ పోలీసోళ్ల వాలకమే ఇంత. ఊరందరికాడ మనం ముష్టెత్తుకొస్తే మనకాడ ముష్టికి బయల్దేరుతారు ఈ పోలీసోళ్ళ. అందులో ఆ పోతురాజుగాడు మరీను. మనం ఇక్కడ పడుకున్నందుకు ఈ జాగా ఆడి బాబుగారి జాగా అయి నట్టు మన కాడ ఆసీలు వొసూలు సేస్తాడు. ఇదేటయినా బాగుందటయ్యా, జెవాను బాబూ అంటే సేన, ఆ రోజుకి ఊరుకొంటాడు. కాని, ఆ మరసటి రోజే వచ్చి ఎవులో మంత్రిగారొస్తు న్నారు, ఈ దారంటే ఎల్లిపోవస్తున్నారు, మీ రిక్కడ ఉండకూడదని కర్రుచ్చుకుని ఎంట తగుల్తాడు. సీసీసీ, ఈ పోలీసోళ్ళు కాకీబట్టలేస్తున్నారన్న మాటేగాని, కాసం తయినా కనికారం నేకండా, పెద్ద కంత్రీ




A.S. Murty

పనులు సేస్తన్నారే" అని ఆగి, "ఇంతకీ ఏటాలోసించావు మన సంగతి?" అన్నాడు పెంటయ్య.

"ఏ సంగతి?" అంది సూరమ్మ. ఎక్కడికో హడావుడిగా పోతున్న చంద్రుణ్ణి, మేఘాలను చూస్తూ. తనకి ఒక కాలు ఉంది. అయినా, తను రెండు కాళ్లూ ఉన్నవాళ్లు నడిచినంత జోరుగా నడవ లేదు. కాని, కాళ్లు అసలే్లకపోయినా ఆ చంద్రుడు, ఆ మేఘాలు అంత వేగంగా ఎలా నడవగలుగుతున్నాయి. అలా నడిచి పోయిన మేఘాలు ఎక్కడికి వెళుతున్నాయి, జోరుగా పరుగెడుతున్నట్టు కనబడ తాడే తప్ప, చంద్రుడు ఆకాశం వదిలి ఎప్పుడూ ఎక్కడికి ఎందుకు పోవడం లేదు? అనేవి సూరమ్మకి జ్ఞాపకం తెలిసినప్పట్నుంచి ఉన్న సందేహాలు. అందుకే ఆకాశాన్ని అంత దీక్షగా చూస్తూంది.

"ఇంకే సంగతీ, మన పెళ్లి సంగతి" అంటూ కిసుక్కున నవ్వాడు పెంటయ్య.

"ఆ సంగతా? ఇంకా ఆలోసించాల" అంది సూరమ్మ నిర్లక్ష్యంగా. దాని నిర్లక్ష్యం పెంటయ్యకి పీకల వరకు కోపం తెప్పించింది.

"నువ్వేటి, పెద్ద జెమీందారుగోరి పెంపుడుకూతుర్ననుకుంటన్నావా? నేకపోతే, సినీమాయాకటేరు ననుకుంటా న్నావా ఆలోసించడానికి; అడుక్కున్నదానికీ డాబే!" అన్నాడు కసిగా, కర్కశంగా. అంటూ జేబులోనుంచి చుట్ట తీసి అగ్గిపెట్టెతో వెలిగించాడు.

"ఒరే, పెంటిగా, నువ్వెత్త పున్నేనికి నోరు పారేసుకోకు. నాను నోరు ఇప్పి నంటే తిన్నగా రాదు. నేన్నీ సొమ్మేం తిన్నానంట్రా అంటే పడుండడానికి? నేను అడుక్కుంటే, మరా సంపాదనలో నాలుగో వంతు నువ్వా తింటన్నావు. గురుతుంచుకో" అంది సూరమ్మకూడా కోపంగా.


"ఒలే, నాకు నువ్వు పున్నేనికి, దరమా నికి ఇస్తన్నావంటే దెప్పడానికి? నీ పాటకి కుండోయిస్తన్నానేమో, డబ్బిస్తన్నా వేమో? నువ్విచ్చేది కూలే! ముష్టి కాదు, దొంగముండా" అన్నాడు పెంటయ్య.

"ఓలబ్బో, వాయించేస్తన్నాడు కుండ, నీ ఎదవకుండ లేనప్పుడుకూడా రోజుకి రెండ్రూపాయలు ఎడంసేత్తో సంపా యించేదాన్ని. అప్పొ, అప్పొ అంటూ మా యమ్మ పక్కన సేరినావు కాబట్టి, నిన్ను నా ఎంట తిప్పుతున్నాను. నేకపోతే నీ పని జేబులు కొట్టుకు తిరగడమే!! వాయించేస్తన్నాడంట మా పెద్దకుండ. అసలు నా పాట నేకపోతే నీ కుండోయిద్యం ఎవుడిక్కావాలి? నేనే నేకపోతే నువ్వా నీవు, నీ కుండా నేదు. ఒక్కలుకూడా దయదలిసి ఒక్క పయిసా ఎయ్యరు. పందెం పోతునాగున్నావు, పని సేసుకో నేవ్రటా పోరంబోకు ఎదవా అని ఎదవ ముకంమీద తుపుక్కున ఉమ్మేస్తారు" అంటూ తుపుక్కున ఉమ్మేసింది ఓ పక్కన.

పెంటయ్య అందు కేదో అనబోతుం డగా, అతని నోట్లోని చుట్టతో తన చుట్ట వెలిగించుకుందామని అక్కడి కొచ్చాడు సీతారాంతాతయ్య. సీతారాం తాతయ్య వెంకటేశ్వరుడి పటం పట్టు కుని సినిమాపాటల స్టైల్లో భక్తి పాటలు పాడుతూ అడుక్కుంటాడు. వయసు ఏభై ఉంటుంది. కాని, చూడ్డాని కింకా పెద్దవాడిలాగ కనబడతాడు.

"ఏట్రోయ్, పెంటిగా, మరదలితో సరసాలాడతన్నావు" అంటూ పెంటయ్య నోట్లోని చుట్టతో తన చుట్ట వెలిగించు కున్నాడు.

నేస్తంలాగ సాయం చేసింది. కాని, అది అనుద్దిన జబ్బు సేసి సచ్చిపోయింది. ఆరోజుకాణ్ణించి నన్ను నడిపించే దిక్కు నేకపోయింది. ఎన్నోసార్లు రోడ్డు మీద నడబోయి, కాలవల్లో పడిపోనాను. దెబ్బలు తగిలించుకున్నాను. కొంతమంది ఎదవలు నాకు పైసా ఏసినట్టే ఏసి నేను పరుసుకున్న గుడ్డని, గుడ్డమీద పడిన డబ్బుల్ని ఎత్తుకొని పోయారు. అయితే, గుడ్డోడి సొమ్ము దొంగతనం సేసినోళ్లు పురుగులు కారి సత్తార్లే! ఇదంతా ఎందుకు సెబతన్నానంటే, గుడ్డిజెనమ మా సెడ్డ సెండాలవయింది. అప్పుడప్పుడనిపిస్తాది నా ఎంట మరో మణిసి తోడుంటే బావున్నని! కాని ఎవులొస్తారు నాకు తోడు? 'ఒరే, సన్నాసీ, శుబ్బరంగా పెళ్లి సేసుకోకూడదట్రా' అని సివాసెలంలో ఉండే ఎంకన్నగోడు ఎప్పుడూ సెబుతుండేవోడు. కాని, నాది గుడ్డి జెనమం. మనల్ని ఎవులు ముష్టోళ్లుగా మార్సారో తెలీదు. ఎవురికీ కనిపించని ఆ బెమ్మదేవుడా? నేకపోతే మనకంటె మంచి బతుకులు బతికే పెద్దమనుసులా? ఎవులు మార్సారో తెలీదు. అలాగే మనల్ని ఈ ముష్టిబతుకుల్నించి మంచి బతుకులవైపు ఎవులు మళ్లించుతారో కూడా తెలీదు. మన కెంతోమంది అమ్మోర్లు ఉన్నారంట. ఊరి కొక అమ్మోరు, ఊరికొక దేవుడు ఉన్నారంట. మన కున్నంత మంది అమ్మోర్లు గాని, దేవుళ్లుగాని మరెవురికి నేరని మాతోపాటు అడుక్కుండే ముసలయ్యగోడు మందు పట్టులో ఉన్నప్పుడల్లా అంటుండే వోడు. కాని, ఆ దేవుళ్లందరికి అబిషేకాలు సేయించుకోడానికే తప్ప, మన్లాంటి అలగాజెనం ఏటయిపోతన్నారో అని ఆలోసించడానికి టైము నేదని ఆ ముసలయ్యగోడే అంటుండేవోడు. పోనీ, మన ముష్టిజెనమల్ని ఛూసి, జాలి పడి కొండబ్బ దరమం సేసే మా రాజులయినా, తమకు కలిగినకాడికి పైసో, పరకో దరమం సేస్తన్నారే తప్ప, మనల్ని మార్చి, ముందుకు నడిపిద్దామని ఎవులూ ముందుకు రాడంనేదు. మనవంతా కలిసి, మన మంచీ సెడ్డా సూడ్డానికి గవుర్నమెంటు నెట్టుకున్నామని సివాసెలంలోని టీకొట్టు ఈ రాజుబాబు సెప్పాడు. కాని, ఆ గవుర్నమెంటులో నున్న బాబులకి ఆళ్ల పెట్టుబళ్ళు, నాభాలు లెక్క సూసుకోడానికే టైము సాలటం నేదంట. టైము నేకపోవటం వొల్లనే ఆ పెబువులు మనలాంటోళ్ల బతుకులవైపు సూడనేక పోతన్నారంట. ఇకమీదట సూత్తారన్న గేరంటీకూడ



శిల్పకళ (సోమనాథపూర్)
ఫోటో — ఎమ్. ఆర్. వెంకటరమణన్ (మద్రాసు-4)

నేదని ఈ రాజబాబే మొన్నోపారి సెప్పాడు. ఇదంతా ఎందుకు సెబుతున్నాడు, ఏటీ ఎదవ గోలని తిట్టకు. మన బతుకుల్ని మరో రావుడో, దేవుడో వచ్చి మార్చడు; ఈ గవుర్నమెంటూ మార్చదు. ఎవులూ మార్చరు కాబట్టి మనకు మనవే మారాల. మన బతుకుల్ని మంచి కేసి మళ్లించుకున్నా, మట్టిలో కలిపేసుకున్నా అంతా మన సేతిలోనే ఉంది. మనం ఎనక జెలమంలో ఎవులి అన్నం కంచంలో అగ్గినిప్పు వేశామో, ఈ నాడు ఎంగిలికూడుక్కూడా గతి నేకండా బతుకుతున్నాం. ఇంక మనకి పుట్టబోయే కొడుక్కో, కూతురికో ఇదే ఎదవబతుకు బతకమని సెప్పి ఆళ్లకి ఓ తోవ సూపించకుండా గాలికొదిలెయ్యడం పాపం! ఆ పాపం సేసేబదులు, పెళ్లి గిల్లి మానేసి ఈ ఒంటిబతుకే సివరంటా బతికేసి, ఎక్కడో రాలిపోడం మంచిది. పుట్టిన పిల్లల కళ్లలో జిల్లేడు పాలు ఏసి, శుబ్బరంగా ఉన్న ఆళ్ల కాలు సేతుల్ని ఇరిచేసి, ముష్టి బతుకులు బతకడానికి అదే మంచి దారని సెప్పడం పరమ సెండాలమయింది. ఆ పనికి నా నొప్పను. నాకు పిల్లలంటూ పుట్టి, ఆళ్లు నాలాగే గుడ్డోళ్లు కాపోతే, ఆళ్లని రెక్కల కష్టం సేసి గెంజినీళ్లు తాగి బతకమంటాను" అన్నాడు సన్యాసి.

ఈ మాటలు పూర్తయేసరికి సన్యాసి పలచనిబుగ్గలమీదుగాకన్నీరు సన్నగా కారి, జారికలు కట్టింది. ఈ మాటలు విన్నాక సూరమ్మగాని, ఆదెమ్మగాని ఏమీ మాట్లాడలేదు.

ఆ మధ్యాహ్నం—

సూరమ్మ తనకున్న చింకిగుడ్డల్ని భద్రంగా ఓ మూటగా కట్టి, తన తల్లి పక్కనున్న ఊతకర్రని తీసుకొని, "అమ్మా, సన్నాసిని లెగ్గొట్టి నడిపించే" అంది.

"ఎక్కడికే? ఎక్కడి కెళ్తన్నారు?" అన్నాడు పెంటయ్య అయోమయంగా.

"ఒరే, పెంటిగా, నువ్వేటి అనుకోకు. నాను ఈ సన్నాసితో సివాసెలం ఎళ్లిపోతన్నాను. ఈడు గుడ్డోడే కాని, ఈడి ఉద్దేసాలు, నా ఉద్దేసాలు అచ్చు గుద్దినట్టు ఒక్కనాగే ఉన్నాయి. మరంచేత ఈడితోనే ఎళ్లిపోతన్నాను. ఇక్కడే ఉండిపోదా మనుకున్నాను కాని, రాబోయావి సిమ్మాద్రి అప్పన్న గంధం వొలుపు రోజులు. అక్కడికే ఎళ్లిపోదామని సన్నాసి అన్నాడు. కట్టుకున్నోడు కాట్లోకి రమ్మన్నా ఎళ్లిపోవాలి కదా. మా యమ్మ కూడ సివాసెలవే ఎళ్లిపోదావంది" అంది సూరమ్మ.

ఈ మాటలు విన్నాక పెంటయ్యకి ఎంత కోపం వచ్చిందో చెప్పడం కష్టం. కాని, ఆ క్షణంలో వాడు చూసిన చూపులకే గనక శక్తి ఉంటే సూరమ్మ అమాంతంగా పిడికెడు బుగ్గయిపోయి ఉండేది. పళ్లు పటపట కొరుకుతూ, "ఏటే, అప్పా, నీకూ ఆ గుడ్డోడే నచ్చాడటే? అదంటే సిన్నగుంట కాని, నీ మాటేటి? ఆ గుంటని నాకిచ్చి ముడెడతావా, నేదా?" అన్నాడు పెంటయ్య.

"అదా సన్నాసినే ఒల్లుకున్నాది. అందుకు నా నేటి సెయ్యడం? పొద్దుటి కాణ్ణించి దానికి సిలక్కి సెప్పినట్టు సెప్పాను. కాని, అది నా మాట ఇననేదు. దాని మాట కాదని నా నేటి సెయ్యగల్ను. .." అంది ఆదెమ్మ నిస్సహాయంగా. తరవాత సన్నాసిని నిలబెట్టి, చేతికర్ర ఊతిచ్చి, ఆ కర్ర రెండో చివర తను పట్టుకుని ముందుకు నడిచింది. వాళ్లిద్దరి వెంట సూరమ్మ, ఊతకర్రల మీద ఒంటికాలును ఆన్చుకుంటూ తనూ ముందుకు సాగింది.

"గుడ్డోణ్ణి మొగుడిగా ఉంచుకుంటే రెండు సేతులా సంపాదించొచ్చని ఆడితో ఎళ్లిపోతన్నాది. థూ, ఛీ ఛీ, కుక్క కయినా యిస్సాసం ఏడిసిందిగాని, దీనికి యిస్సాసం నేకపోయింది. దీని కడుపు, దీనమ్మ కడుపు మాడ. . ." అంటూ ఇంకా ఏవేవో బూతులు తిడుతూ, పిచ్చెక్కిన మనిషిలాగ జుత్తు పీక్కుంటూ, సారా తాగిన మనిషిలాగ అటూ ఇటూ ఊగుతూ, దెయ్యం పట్టిన మనిషిలాగ వెర్రిచూపులు చూస్తూ, కాలుగాలిన పిల్లిలాగ ఒక చోట నిలవక తిరుగుతున్నాడు పెంటయ్య. సూరమ్మ డబ్బు కోసమే గుడ్డివాణ్ణి కట్టుకుని సింహాచలం వెళ్లిపోతూందని వాడు అనుకున్నాడే తప్ప, ఆ గుడ్డిసన్యాసి కోరుకుంటున్న 'మార్పునే' సూరమ్మ ఎన్నాళ్లనించో కోరుకుంటున్నాదని, ఆ మార్పును కోరే మనిషి గుడ్డివాడయినా సరే ఇష్టపడి తమ రాబోయే తరం 'మంచి' కోసం సన్యాసిని భర్తగా ఎంచుకుందని పెంటయ్య గమనించలేకపోయాడు. ఎందుకంటే వాడు మార్పు కోరని మనిషి. ★

---

స్త్రీ హృదయం చంద్రుని వలె రోజురోజుకు మారుతూ ఉంటుంది. అయితే, ఆ హృదయంలో ఎప్పుడూ ఒక పురుషుడు ఉంటాడు.

—వ.వ